# రాజశిల్పి

మూలం : కన్నడ కథానిక
శ్రీ అ. న. కృష్ణరాయలు

★

అనువాదం
శ్రీ పి. వెంకోబాచార్లు

రాజశిల్పి స్వగ్రామం మరలివచ్చాడు. ఊరంతా అదేమాట. అతన్ని చూద్దామని ఆ ఇంటి ముందు ఊరంతా గుమిగూడింది. శిల్పిదర్శనం లేదు.

ఆ మూకకు సేవకులు సరియైన సమాధానం చెప్పలేకపోయారు.

"ఇంతకీ శిల్పి వచ్చాడా, లేదా !"

"అరే! ఇదే ఇంత సమస్య అయిందేం" అని ఆక్షేపించారు అభిజ్ఞులు.

సమస్యను సమస్యగానే ఉంచి; జనం సద్దుమణిగారు.

శిల్పి గృహారామంలో మారుమూల, నికుంజ చ్ఛాయలో, శిలావేదికపై పద్మాసనాసీనుడై, అర్ధ నిమీలితనయనాలతో, ఆలోచనలో మునిగి ఉన్నాడు. శిలావితర్దికసమీపంలో కూర్చొని ఉంది మైనా. నారింజతొనలు ఒలిచి, ముత్యాల విడమర్చి శిల్పిచేతి కందిస్తూంది. శిల్పి పరధ్యానంలో, ఆ తొనల ముత్యాలు అల్లాగే అతని చేతిలోనే ఉండిపోతున్నాయి.

మైనా హెచ్చరించింది.

శిల్పి కనువిప్పార్చి, ఓరమోము పెట్టి, మమతతో, మైనాను పరికించాడు. నారింజపండుపసిమి మేను, సుశోభితమైన అంగాంగరేఖ, యవ్వనంసుమించిన వక్షోరుహాలు, సుదీర్ఘ నీలకేశరాశి, మైనా నిజంగా సుందరి.

ఆమె కంటినీటికి శిల్పికనీనికలు జలదరించాయి.

"మైనా ! ఏడుస్తున్నావా !"

ఆ చిరు ఆదరణకు మైనా కంఠపుముడి సడలింది. వెక్కులువెక్కులుగా ఏడ్పు వెల్లివిరిసింది.

"ఎందుకు మైనా ఏడుపు !...ఊరుకోవూ ?"

"ఈ రెండేళ్లూ—ఎక్కడికి వెళ్లారు ?"

"మైనా ! ఆ ఒక్కవిషయం అడగకుండా ఉండలేవా !"

"స్వామీ మీకు నాదగ్గిర మాట దాచే పని లేదు కదా !"

"లేదు ! కాని, ఈ ఒక్కటీ నా ఆత్మీయమైన రహస్యం అనుకోలేవా ? ఏదో అబద్ధమాడి సమాధాన పరచాలా !"

"పోనీండి ! మళ్ళీ అల్లా వెళ్లిపోరుకదా ?"

"వెళ్ళననే అనిపిస్తోంది."

"అనుమానమేనా ! స్థిరం లేదా ప్రభూ ?"

"మైనా ! ప్రపంచంలో, ఈ జీవితంలో, ఏది స్థిరం—మైనా...?"

తనలో తనుగా మాట సాగించుకొంటూ చుబుకం నిమురుకొంటున్నాడు శిల్పి.

మైనా తన్ను మరల్చుకొంది.

"స్వామీ ! పని ప్రారంభిస్తారా. మన్ను తయారుచేయనా ?"

"ఇప్పుడు వద్దు."

"మరి పని ప్రారంభించరా ?"

"......మళ్లీ వచ్చాక"

రాజమందిరంనుంచి ఒక భటుడు ఒక లేఖను తెచ్చి శిల్పికి సమర్పించాడు. లేఖను చదువుతోంటే శిల్పిమొగం ముడిపడ్డది.

"జాబు ఎక్కడిది" దని మైనా అడిగింది.

"రమ్మనమని మహారాజు వార్త పంపారు"

"వెళ్తారా !"

శిల్పి లేచి, భటునితో, "ఇప్పుడే వస్తానని చెప్పుపో" అన్నాడు. భటుడు నిష్క్రమించాడు.

మైనా వారించింది. "స్వామీ! అక్కడికి వెళ్లవద్దు."

"ఏం ?"

"నా కేదో భయంగా ఉంది–"

"దేనికి భయం ?"

"మనకు రాజింటి సహవాసం వద్దు. అసలు ఈ ఊరు వద్దు. ఈ దేశం వద్దు. దూరంగా పోదాం పదండి. నన్ను నా కాశ్మీరం పిలుస్తోంది."

"పిచ్చిదానా! మైనా," అని ఆమె నుదురు నిమురుతున్నాడు. ఆమె కన్ను లప్పచెప్పి, మాటలు అప్పచెప్పుతూంది.

"క్రిందటిసారి రాజమందిరంనుంచి వచ్చిన రాత్రే ప్రవాసగతులై వెళ్ళిపోయారు. స్వామీ! ఆ యింటి చెలిమి అంటేనే నాకు అడలుపుట్టుంది"

"మైనా! నేను పిచ్చివాణ్ణిగా కనపడ్తున్నాను కదూ ?"

"నాకు కనబడుతూంది నా దైవ మొక్కడే. వేరేమీ ఈ మూర్తిలో నాకు గోచరించవు."

"మైనా! నువ్వు సుఖంగా ఉండాలనే నా కోరిక !"

"నాకు తెలుసును ప్రభూ!"

"మైనా! ఒక్క మాట చెప్తాను వింటావా"

"మీ ఆజ్ఞ ఏదీ కాదనను"

"ఆజ్ఞగా కాదు, మైనా! బలవంతంమీద కాదు. ఇచ్ఛాపూర్వకంగా నా మాటకు ఒప్పుకోలు..."

"ఏమిటో చెప్పండి :"

"నీకు బ్రతుకులో ప్రశాంతపరిస్థితులు సమకూర్చి, నిన్ను కాశ్మీరం తీసుకొనివెళ్తాను."

మైనా చకితురాలైంది. ద్రవీభూతయైన ట్లాతని పాదాల్రమోల కరిగిపోయింది.

శిల్పి ఆప్యాయంగా ఆమెను పొదువుకొని లేవనెత్తాడు.

"స్వామీ! నన్ను విడువవద్దు"

"మైనా!......"

"మీ చరణదాసిని. ఆ సంపత్తిని మించి మరే నగలూ నాణ్యాలూ కోరను. నాకు సర్వస్వం మీరే."

"అది కాదు— మైనా!"

"నేను ఈర్ష్యాళువును కాను. మీరు కోరుకొన్న స్త్రీని తెచ్చుకోండి. ఆమెకుకూడా సేవ చేస్తూ జీవిస్తాను. దూరంనుంచే మీ సంతోషంలో భాగస్థురాలనై సంతోషిస్తాను."

"మైనా! ఆ ఊహతో నిన్ను పొమ్మన్నానని అనుకున్నావా? పిచ్చిదానా!"

"ఎందుకైనా కానియ్యండి. నన్నుమాత్రం వదలవద్దు. ఈ రెండేళ్ళ వియోగమూ జీవాలతో భరించానంటే, ఏనాటికైనా మీరు తిరిగి వస్తారన్న ఆశతోనే. ఇప్పుడు నన్ను దిక్కుమాలినదాన్నిగా చేయవద్దు."

శిల్పి తెములుచ్చుకొని నిల్చాడు.

"రాజమందిరానికి వెళ్ళవలసినవేళ అయింది. రాజుకు కోపం రావచ్చును."

"చేతులు జోడించి ప్రార్థిస్తాను, రాజమందిర సహవాసం వదిలెయ్యండి."

"సరే–కాని"

అప్పటికి తప్పించుకొని బైటపడి రాజమందిర ముఖంగా నడిచాడు శిల్పి.

మైనా చింతిస్తూ కూలబడిపోయింది. ప్రకృతి వలయాకృతివహించి, అంతకంతకూ కుంభించుకొంటూ, తన్ను చుట్టివేస్తూన్నట్లు తోచింది. అతనికి తను 'పుస్తె కట్టిన భార్య' కాదు. అతని యిష్టంవచ్చినట్లే అతను చేసుకోవచ్చునని సమాధానపరుచుకో ప్రయత్నించుకుంది. పూర్వస్మృతులు కెలకవేశాయి.

తను కాశ్మీరంలో పడవలు నడపే బోయీల పిల్ల. రాజశిల్పి కాశ్మీరం వచ్చినప్పుడు తమ పడవలో అతిథిగా ఉన్నాడు. అతని పరిచర్యలలో తను నిమగ్న అయిపోయింది. అతని మనస్సు చూరగొంది. శిల్పి, ఆ బోయీ నడిగాడు, మైనాను తనకు జతగా పంపమని. "సర్కార్ మాకు అన్నం నీళ్లూ, అన్నీ మైనాయే-మైనా లేనిదే మా పడవ కెవళ్లు వస్తారు?" అన్నాడు బోయీ. రెండువేల రూపాయలతో బోయీని సమాధానపరిచాడు శిల్పి. మైనా శిల్పివెంట రాగలిగింది.

శిల్పిగృహంలో, యాజమాన్యమంతా, రాను రాను మైనాచేతికి చిక్కింది. అతని విగ్రహాలకు తడిమన్ను ఆమెచేతుల్లో తయారయితేతప్ప అతని శిల్పం ససిపడేది కాదు. ఆమె రూపభంగిమలలో తప్ప అతని విగ్రహాలకు జీవస్వరూపాలు ఏర్పడేవి కావు. ఆమె ఎదుట లేనిదే, అతని అంగుళులు, ఆ మృత్తికకు చైతన్యమియ్యగలిగేవి కావు. అతని విగ్రహాలలోని అవయవసౌష్ఠవం, కళావైదగ్ధ్యం, జీవస్వరం అన్నిటికీ మాతృక మైనా.

శిల్పి కిది తెలుసును. ఆమె మన్ను తడిపి ఇయ్యకుంటే ఆ విగ్రహానికి అతని కళానైపుణ్యం అంతా కూడా జీవమియ్యగలిగేది కాదు. అతని హృదయంలో మైనాకు విశిష్టస్థానం లేకపోలేదు. కాని ఆ స్థానంలోనే తీరని వ్యథ-స్థాన మిచ్చినంతమాత్రంలోనే ఆత్మ సమాధానం-తన ప్రతిభకు కారణభూతురాలైనమైనా "ఒక దాసి"! ఈ ప్రజ్ఞాగర్వంలో ఒక్కొక్కప్పుడు, ఈ మైనా లేకుంటే, తన కళాప్రాశస్త్యానికి లోటేమి టని అనుకొనేవాడు. కాని మైనా స్పర్శ లేని కృతి నీరసమై నిర్జీవ మైపోయేది.

శిల్పిశిల్పాల్ని పరిపూర్ణంగానే లోకం పరిగణించేది. కాని శిల్పికి ఆ ఆత్మసంతృప్తి చిక్కేది కాదు. తన శిల్పాలలో ఏదో అసంపూర్ణత్వమే గోచరిస్తూ వేధిస్తూండేది.

ఆ హృదయంలోని ఆ అగ్నిజ్వాల పరులకు పరిస్ఫుటం కాదు. దాని స్వభావం అతనికే అగమ్యగోచరం.

రాజశిల్పి 'కీర్తి', శిఖరాల నందుకొన్నది. మహారాజాధిరాజు లా శిల్పాల నార్జించుకోటానికి పోటీలుపడేవారు. ఇక సామాన్యప్రజకు అతడు రూపొందిన కళాదేవత; లక్ష్మీపుత్రుడు. అతని ఇంట కుక్కపిల్లకూడా వెండికంచాల విందారగిస్తుం దని ప్రతీతి. ఇంతటి భోగభాగ్యాలమధ్య నున్నా, ఆ హృదయంలో అసంతృప్తిజ్వాల లారవు. ఆ జీవితాన్ని వైరాగ్యం అలముకొంటూంటుంది.

నిస్స్వార్థ, నిర్మలినహృదయంతో మైనా శిల్పిని ప్రేమించింది. ఆ ప్రేమలో, తన సర్వస్వం అతనికి కానుకగా అర్పించింది.

'కుందనమువంటి మేను — స్ఫటికాచ్ఛవినిర్మలమైన హృదయము -శరద్రాత్రుల వెన్నెల వెల్లువలలో, మెత్తని పచ్చికసెజ్జలపై ఆమె వపుఃకోమలసౌభాగ్యాన్ని-అతని కాస్వాదింప నర్పించేది. ఆ నిసర్గసౌందర్యశోభ అతని కన్నుల మూర్తీభవించి నిలచిపోయేది. కాని ఆ నిర్నిమేషత్వాన్ని భంగించుకొంటూనే, నిత్యనూతనమై, నవనవోన్మేషమై, మైనాకళారూపం, క్షణక్షణ మొకొక్క నూతనకళను ప్రచురించుకొంటూండేది,అతని రసప్రపంచంలో! ఆమె ఒకొక్క చూపుతో ఒకొక్క నూతనజగత్తు నిర్మిత మయ్యేది. "ఈమె ఒక దేవత.'యా తత్రా స్తే యువతివిషయే సృష్టిరాద్యేవ ధాతుః'; దేవశిల్పిశిల్పంలోనిపరిపూర్ణస్వరూపం మైనా." అనుకొనేవాడు శిల్పి.

ఆ పరిపూర్ణత్వాన్ని తన శిల్పంలో ఇముడ్చజూచాడు రాజశిల్పి. అనేకవిధాలలో ఆ రూపాన్ని మట్టిలో మలిచాడు. ఆ పెదవుల చిరునవ్వు-పద్మపత్రాలవంటి ఆ నేత్రాలు, అన్నీ సమకూర్చి, "వనసుందరి"ని నిర్మించాడు.

"వనసుందరి," శిల్పసౌందర్యానికి రాజు విమోహితు డయ్యాడు. శిల్పికృతులతో రాజప్రాసాదవిలాసగృహాలు అలంకృత మయ్యాయి. "అభిసారిక", "పరిత్యక్త", "నిరీక్ష" అన్ని విగ్రహాలలోనూ, మైనా సౌందర్యవిలాసాలకు శిల్పి నీరాజనాలెత్తాడు.

ప్రజ్ఞాగర్వంలో శిల్పి మునిగిపోగల అధికారమూ, అవకాశమూ రెండూ కూడా శిల్పి కున్నాయి. కాని మనస్సులోని ఆ తీరని అసంతృప్తి, బాహ్యంగా అతన్ని నిర్లిప్తుణ్ణి చేసింది.

*  *  *

రాజు రాకకు ఎదురుచూస్తూ విలాసగృహంలో ఏకాకియై కూర్చున్నాడు శిల్పి.—తన శిల్పసంతానం మధ్య శిల్పి మసులుతున్నాడు. 'వనసుందరి' ముంగురులు సవరిస్తున్నాడు, 'అభిసారికకు' కన్ను గిలిపాడు. "పరిత్యక్త"ను సానునయంగా తల నిమురుతున్నాడు.

ఆ దృష్టి అకస్మాత్తుగా, గవాక్షం దాటి రాజగృహంవైపు ప్రసరించింది.

ఆకాశాన్ని పెనవేసుకొంటూ నిట్టనిలువునా పర్వతోత్తుంగమై ఆ సౌధం కన్నుల కట్టింది. తన ప్రతిభ అన్నపూతతో, ఆ రూపానికి కళాకృతి ఇస్తే, అని, ఒకమారనుకొని ఇంతలో మరల నిట్టూర్పు పుచ్చాడు.

మహారాజు ఆగమనాన్ని సూచించారు భటులు. శిల్పి వినమ్రుడై రాజుకి ప్రణామం చేసి, వైదొలగి నిల్చున్నాడు. రాజు శిల్పిచేతిని తన చేతిలో గీలించి, తనప్రక్కనే కూర్చుండబెట్టుకొన్నాడు.

"రాజశిల్పులు, రాజఋషులైనారో", అని మందహాసం చేశాడు రాజు.

"లేదు ప్రభూ—ఊరికే గడ్డం పెరిగింది."

"శిల్పీ, ఇదేం పరివర్తన ?"

"తారుణ్యం పోగొట్టుకొన్న మానవుడు గాంభీర్యానికై అఱ్ఱుజాస్తున్నాడు. ప్రభూ బ్రతుకుతెరువులో ఇది ఒక ఫణితి."

"శిల్పీ-నువ్వు చాలా మారిపోతున్నావు! "

"ప్రభువులను కాదనటం అపచారం."

"ప్రభువును గాదు శిల్పీ, నీ స్నేహితుడను, నీ భక్తుడను."

"అంత పెద్దమాట వద్దు, ప్రభూ"

"కాదు శిల్పీ—నిజం! నా మాట నమ్ము—మేము రాజులమే—మహారాజులమే—కాని మా జీవితాలు బుద్బుదప్రాయాలు. ఏక్షణంలోనైనా మేము నశించిపోవచ్చు కాని నీ అమరత్వంముందు శతాబ్దాలే జితించిపోతాయి. లోకం మమ్మల్ని ఆరాధించటం మా జీవితపర్యంతంమాత్రమే. తర్వాత మరిచిపోతుంది."

"ప్రభూ మమ్మల్ని జీవించిఉండగనే మరిచిపోతారు."

"ఆ నింద లోకంపై వెయ్యటానికి, నువ్వు తగవు శిల్పీ"

"నిజమే ప్రభూ—పోనీ మీవర్గంలోనే చేర్చండి. ముందు ముందు నన్నూ జనం మర్చిపోతారు."

"శిల్పీ! ఇన్ని దినాలుగా ఎక్కడికి వెళ్లావు!"

"క్షమించండి ప్రభూ—ఆ ఒక్కవిషయం అడగవద్దు."

"పోనీలే !"

"ప్రభువులు ఏదో పనిమీద నన్ను పిలిపించారు"

"రాజకుమారిని చూచావు కదా?"

"ఁ! చూచాయగా !"

"ఆమెమూర్తిని నువ్వు నిర్మించాలి."

శిల్పి మాట్లాడలేదు.

"ఎందుకు అనుమానిస్తున్నావు ?"

శిల్పి నిరుత్తరుడైనాడు.

"ఆమె నొకసారి మరల చూడు"

"అగత్యం లేదు ప్రభూ."

"మరి—?"

"ప్రభూ క్షమించాలి. ఈ విగ్రహం నేను చెక్కలేను."

ప్రభువుకు నొసలు ముడిపడినయ్.

"ప్రభువులు కోపం తెచ్చుకోవద్దు."

"తెచ్చుకోనక్కరలేదు."

"ఈ ఉద్యోగంనుండి విరమించుకోటానికి నాకు అనుజ్ఞ ఇయ్యవలసిందిగా ప్రభువులను కోరుతున్నాను."

ప్రభువు మొగంలో నొసటిముడి సడలింది.

"కారణ మేమిటి శిల్పీ! ఇక్కడేమైనా లోపం జరుగుతూందా?"

"ఏ లోపమూ లేదు."

"మరెవరైనా రాజులు ఆహ్వానించారా.?"

"తమను విడిచి మరొకరాజును ఆశ్రయించను ప్రభూ."

"మరి విరమణకు కారణం?"

"కేవలం అసంతృప్తి"

"శిల్పీ, నీ కోరికకు అభ్యంతరం లేదే. నా రాజత్వం కావాలంటే, ఈయ ననే! ఆరామాలు, అగ్రహారాలు, కొంతా కనకాలు, నవరత్న నిధులూ—ఏది కావాలి చెప్పు, శిల్పీ—క్షణంలో నీ వవుతాయి."

"ప్రభూ అవేవీ కోరను!"

"మరి?"

"స్వాతంత్ర్యంమాత్రమే కోరుతాను"

"నీవు నా బందీవి కావే! స్నేహితుడవనే అనుకొంటున్నాను శిల్పీ."

"నా చిత్తవృత్తి కనుగుణంగా కళ నారాధించుకోగల స్వాతంత్ర్యం ప్రభూ"

"శిల్పీ—మధ్యస్థ మొకటి చెప్పేనా?"

"విన్నవించండి, ప్రభూ"

"రాకుమారి విగ్రహం మాత్రం నాకోసం నిర్మించు. ఆ తర్వాత నిన్నేమీ అడగను."

శిల్పి ఆలోచనలో పడ్డాడు.

"శిల్పీ—ఇది కేవలం నా ఆనందం కోసమే కాదు. దేశక్షేమమూ కొంత ఇమిడిఉంది"

శిల్పి చకితుడై చూశాడు.

"పరరాజు బలిష్ఠుడు—నా దేశంపై చూపు పరుపుతున్నాడు."

"రాకుమారివిగ్రహం—!"

"సంబంధీకమే! ఆ రాజకుమారుని కంట రాకుమారివిగ్రహం పడితే, ఈ దేశాలకు కయ్యము పోయి వియ్యము కుదురుతుంది."

శిల్పి ఆలోచనలోంచి హఠాత్తుగా పలికాడు

"ప్రభూ! మనమధ్య ఈ సమయం నిలుస్తుందా! మళ్ళీ శిల్పవృత్తిలో నియోగించరు కదా?"

"కులదేవత సాక్షి!"

"ప్రభువుల చిత్తం"

హర్షపులకాంకితుడై రాజశిల్పిని కౌగిలించుకొన్నాడు రాజు.

శిల్పి ముక్తసరిగా ఈవిషయం మైనాతో చెప్పాడు. రాజోద్యోగవిముక్తి త్వరలో కాగలదని మైనాకూడా సంతోషించింది.

* * *

రాజప్రాసాదంలో తూర్పుదిక్కున శిల్పిచిత్రాగారం వెలిసింది. మందిర నిర్మాణంలో కళాసౌకర్యాలు శిల్పి స్వయంగా చూచుకున్నాడు. వెలుగునీడలు దిశాభేదం లేకుండా అతని అభీష్టం ప్రకారం శిల్పశాలలో మసులుతాయి. మందిరమధ్యంలో ఒక వేదిక. దానిపై ఒక అస్థిపంజరం. అస్థిసంధులను మృత్తికతో నింపాడు శిల్పి. ప్రక్కనే రాకుమారి ఆసీన అయ్యేందుకు మరో వేదిక.

శుభముహూర్తాన పని ప్రారంభించాడు శిల్పి. ఆ ప్రారంభోద్వేగంలో, శిల్పివదనం సంధ్యారుణరాగరంజిత మయింది. అస్థిపంజరాన్ని మృణ్మయ మొనర్చి, కరచరణాదులు తీరుస్తున్నాడు. అస్పష్టమైన దేహస్వరూపం, మృణ్మూర్తి, తయా రవుతూంది.

"చేటీ, రాకుమారిని ప్రవేశంచెయ్య"మని సంజ్ఞనిచ్చాడు.

నునుజిలుగు పట్టుసెల్లా ధరించి, అంగసౌష్టవం మరుగుపరచని ఆభరణసంచయంతో రాకుమారి ప్రవేశించింది.

శిల్పి స్తబ్ధుడయ్యాడు. అతని మాటకై నిరీక్షించింది ఆమె. అతను మాటాడలేదు.

"నేను ఎక్కడ, ఎల్లా, నిలవాలో శిల్పులు విన్నవిస్తారా?" అని రాకుమారి మందహాసం చేసింది.

మౌనముద్రాలంకారుడై చేతితో వేదిక చూపించాడు శిల్పి. ఆమె అందు నిల్చింది.

శిల్పి వెలుగుతెరలను సవరించి, ఆమె ముఖంపై వెలుగునీడలు కళాప్రపూర్ణంగా ప్రసరింపచేశాడు. దగ్గరకు జరిగి, ఆమె నిలవవలసిన భంగిమను చూపాడు. ఆమె అతన్ననుసరించింది.

"మెడవంపు కుదరలేదు."

"ఇంకా ఎల్లాగ శిల్పీ"

దరిజేరి, ఆమె చుబుకాన్ని స్పృశిస్తూ మెడవంపు దిద్దుతున్నాడు. ఆ స్పర్శలో అంగములు పులకరిస్తున్నాయి. కేవలం శిల్పిగా రాకుమారి కర చరణాది దేహ ప్రమాణాలను కొలబద్దతో సేకరించుకొని, మృణ్మూర్తితో సరిపోల్చుకొంటున్నాడు.

రాకుమారి దివ్యసుందరి. అనాఘ్రాత కుసుమ కోమలత్వం చిందుతున్న, నిండిన కపోలాలు, యౌవన మదానికి జంటపతాకలై నిక్కి నిలచిన వక్షుద్వయం. భుజముల సోయగం పాలరాతితో చెక్కి మలచినట్లుంది.

ఆమె మేని మెత్తదనము పట్టురేకుల నపహసిస్తూంది. సర్వాంగసుందరి అయిన ఆ మూర్తి, దేవశిల్పి అపూర్వరచనలా భాసిస్తూంది.

ఆ సౌందర్య శరాఘాతంలో శిల్పిచేయి స్తంభించిపోయింది. శిల్పిదృష్టి చెదరునట్లుంది. మనస్సును బిగబట్టాడు. ఆ దివ్యమూర్తిలోని జీవకళనంతా తన మృణ్మూర్తిలో ధారవోయ యత్నించాడు.

అహర్నిశలు ఆ శిల్పంపై కృషిచేస్తున్నాడు శిల్పి. మృణ్మూర్తి, మూర్తితాలుస్తూ వస్తూంది. రాకుమారికే ఆ మృణ్మూర్తి ఈర్ష్యాస్థానం కాసాగింది. పూర్ణిమకు పూర్ణిమ గడిచింది.

ఆ పూర్ణిమ వెన్నెలలో శిల్పి తన కృతి ముగించాడు. ఆ కౌముదీప్రసారంలో తన సృష్టిని పరికించుకొన్నాడు. శిల్పంలో కళాకౌశలం తాండవమాడుతూంది. శిల్పంలో లవలేశమైనా దోష మేదీ ఎవరూ చూపించేటట్టు లేదు.

ఆ విగ్రహాన్ని చూచి చూచి, శిల్పి విసుగు చెందాడు. ఆ విగ్రహానికి ముసుగు కప్పాడు.

"ప్రహరీ" అని కేకవైచాడు.

పరిచారకుడు పరుగెత్తుకొంటూ వచ్చి, చేతులు జోడించాడు.

"ఇదిగో మందిరం తాళంచెవులు. రాజుగారి కియ్యి. నా పని పూర్తి అయిందని చెప్పు."

"మీరు..."అనబోతున్నాడు సేవకుడు.

"నేను ఇంటికి వెళ్తున్నా" అని ఆగకుండా ఇంటికి వచ్చాడు శిల్పి.

మైనా ఆ రాత్రంతా అతనికోసం ఎదురుతెన్నులు చూస్తూ గడపమీదే తలవాల్చి, నిద్రకు కునికింది. జాలితో, తన పైపచ్చడం తీసి, ఆమెకు చలి వేయకుండా కప్పాడు.

ప్రొద్దు పొడిచింది; ప్రొద్దు గడిచింది. కునుకుతూన్న మైనా ఉలికిపడి లేచింది. పైనున్న పచ్చడం చూసి,చకితురాలై,శిల్పిని వెదుకుతూ లోనికి పోయింది. శిల్పి అప్పుడే తన శిల్పమందిరంలో ఉన్నాడు. ఒక ఆరున్నర అడుగుల అస్థిపంజరానికి మన్ను మెత్తుతున్నాడు.

మైనా అడుగులో అడుగు వేసుకొంటూ మెల్లిగా దగ్గరకు చేరింది.

"ఎప్పుడు వచ్చారు?"

"రెండుగంటలైందేమో!"

"నన్ను నిద్రలేపరాదా?"

"నా శబరికి నిద్రాభంగం చెయ్యనా ?"

"రాజమందిరంలో పని పూర్తి అయిందా?"

"ఈ ఉషఃకాలానికే ముగించాను."

"శిల్పం ఎల్లా ఉంది?"

"మహారాజు మెచ్చుకోవచ్చును."

"మీరో ?"

"నామాట అడగకద్దు."

"రాకుమారి రూపసుందరిట కదా?"

"అవును, దివ్యసుందరి!"

"మీ కళాప్రతిభకు—ఆ రూపసంపద తోడైతే, పాలకు చక్కెర కలిపినట్లే కదా !"

"అవవచ్చును. కాని పాలు విరిగాయి."

"స్వామీ అదేమి మాట! మీ ప్రతిభ ఎన్నటికీ మాసిపోదు."

"మాపు నా ప్రతిభకే, ఈమాత్రపు సౌందర్యానికి కాదు."

"మీరే అన్నారే ఆమె దివ్యసుందరి, అని."

"సామాన్యనేత్రాలకు—దివ్యచక్షువులకో?"

"సామాన్యమైనదా ?"

"అవును."

"స్వామీ ! మీ ఊహలో సౌందర్యం అంటే ఎలా ఉండాలి?"

"ఇదిగో ఇల్లా." అంటూ శిల్పి మన్ను మెత్తుతూన్న అస్థిపంజరాన్ని చూపాడు. మైనా క్షణకాలం విభ్రమంతో చూచి, కిలకిల నవ్వింది.

"ఇదా !"

"ఇదే! మానవ సౌందర్యంలో, ఇంతకు మించి ఏముంది?"

శిల్పిముఖంలోని కాఠిన్యాన్ని గమనించి, మైనా మెల్లగా అక్కడినుంచి జారింది.

* * *

శిల్పికృషిలో నాలుగు గంటలు గడిచిపోయాయి. విగ్రహంపైన మెత్తిన మన్నును ఛురికతో సరిదిద్దుతున్నాడు శిల్పి. మైనా కన్పించింది.

"ఏం పని ?"

"రాజమందిరంనుంచి ఉద్యోగులు వచ్చారు."

"ఇప్పుడు కాదని చెప్పు."

"అగత్య మంటున్నారు."

విసుగుతో, "సరే. ఇక్కడకే రమ్మన" మని, శిల్పి విగ్రహంపై ముసుగు వేశాడు.

రత్నరాసులు పళ్లెరాలలో నింపి పైన వసనాలు కప్పి, రాజభటులు మోసుకొనివచ్చారు. ఆ వసనాలు తొలగించగానే రత్నరాసులు తళతళలాడసాగాయి.

"ప్రభువులు పంపారు. స్వీకరించండి." అని ఉద్యోగులు విన్నవించుకొన్నారు.

"నాకు అక్కరలేదు. తీసికొనిపొండి."

"నిరాకరిస్తే ప్రభువులు కోపగిస్తారు"

"ఎవరి కోపంతో నాకేమి పని?"

మైనా సద్దుమాచింది.

"వారు ప్రీతితో పంపింది నిరాకరించేదా?"

శిల్పి మైనావంక తీక్ష్ణంగా చూశాడు. వాళ్ల వంక తిరిగి:—

"సరే అక్కడ ఉంచివెళ్లండి"

మైనా అల్లాగే నల్చునివుంది.

శిల్పి పళ్లెరంలోనుంచి ఒక వజ్రాన్ని తీశాడు. రెండో చేతిలో బొమ్మగా చేస్తూన్న మట్టిముద్ద వుంది.

"మైనా! ఇదేమిటో తెలుసా?"

నీరసంగా జవాబిచ్చింది:

"బంకమన్ను!"

"ఇదీ...?"

"వజ్రపు తునుక"

"జనులు దీనికి (వజ్రపుచెయ్యి చూపుతూ) వెల యిస్తారు. నేను దీనికి వెల యిస్తాను."

మైనా మౌనంగా నిలిచింది.

"కారణం ఎరుగుదువా! వజ్రానికి వజ్రమయినందుకే వెల. ఈ మన్నో, కళావిదుని ప్రతిభకు ప్రతీకం కాగలదని వెల. ఒకదానిలో రాతికే వెల; ఇంకొకదానిలో కళకు వెల."

"ప్రభూ! నేను ఈ వెల ఆశించలేదు. రాజులకు వృథా ఆగ్రహం తెప్పించట మెందుకని స్వీకరించుమన్నాను."

"వీటి నిక్కడనుండి తరలించు"

రత్నరాసుల నక్కడనుంచి తీసికొనిపోయింది మైనా. శిల్పి తలవాకిలి బిగించి శిల్పనిర్మాణంలో నిమగ్నుడయాడు.

* * *

శిల్పి "ఆత్మీయమైన" ఆ శిల్ప నిర్మాణంలో నెలలతరబడి లీనుడైపోయాడు. అన్నపానాదులు మాత్రం మైనానిర్బంధంమీద అమనస్కుడై ముగించుకొంటూండేవాడు. తక్కినపుడు తలుపులు బిగించు

కొని ఒక్కడు లోన కూర్చొనేవాడు. మైనాకు కూడా లోనికి ప్రవేశం లేదు. ఆ వాకిలిగడప నాను కొని నిరీక్షిస్తూ, ఆ గడపమీదే తల పెట్టుకొని నిద్రకు తూగుతూండేది మైనా. అతను లోపల ఉన్నాడు. ఆ పదధ్వను లతనివే—ఆ ధ్వనిని మించిన సంగీతమే లేదు ఆమెహృదయానికి. ఆమె కదే తృప్తి.

ఒక రాత్రి మూడోఝామున శిల్పి, మందిరపు తలుపు తెరుచుకొని బైటకు వచ్చాడు. గుమ్మంలో మేను సగం వాల్చి మైనా నిద్రపోతూంది.

"మైనా—మైనా !" ఆమెను నిద్దుర లేపాడు.

ఆమెనిద్ర హఠాద్భంగం కాగా కంపితురాలై లేచి నుల్చుంది.

"ఇటు రా—" సుఖాసీను డయ్యాడు. ఆమె దగ్గిరలో కూర్చుంది.

"మైనా..."

"స్వామీ, బొమ్మ ముగించారా?"

"ముగిసినట్లే!"

"నేను చూడవచ్చునా ?"

"ఇప్పుడు కాదు—రేపు—రేపు, నీకూ, లోకానికీకూడా నా కళాకృతిని అంకితం చేస్తాను."

మాటలు ఆర్తంగా వస్తున్నాయి. మైనాచేయి అతని నుదురుమీద వ్రాలి ఒంటిమీదకు పాకింది.

"స్వామీ—జ్వరం వచ్చిందా ?"

"ఏమో ! వస్తే రానీ. ఇంక భయం లేదు."

మైనా జాగ్రత్తగా ఉపచరిస్తూ అతన్ని నిద్ర పుచ్చింది. అన్నాళ్లకు ఆనాడే నిద్రపోగలిగాడు.

అతనికి మెలుకువ వచ్చేటప్పటికి సూర్యకిరణాలు కన్నులలో పొడుస్తున్నాయి. ఆలస్యానికి చికాకు పడుతూ మేలుకొన్నాడు.

"మైనా !"

"స్వామీ !"

"మందిరానికి వెళ్తున్నాను. ఇది నా పరీక్షదినం. నా శిల్పం విజయవంతం కావాలని ఆశీర్వదించు."

"ఆశీర్వదించటానికి నే నెవరను ప్రభూ?"

"నా ప్రేమలక్ష్మివి !"

మైనాముఖంలో అమృతలాస్యం చిందు లాడింది.

"మీ కృతి అమర మవుతుంది."

తృప్తహృదయుడై శిల్పి మందిరం చేరాడు. హృదయంలో ఏదో ఆవేదన.

ఇది మొదటి శిల్పం కాదు. నూరారుకృతుల చేయి తిరిగిన దిట్ట—మహాశిల్పి. విశ్వవిఖ్యాతుడు—కాని ఆ ఆవేదనలో పసికందుకన్న జేలరై వణికిపోతున్నాడు.

గతరాత్రికే విగ్రహశిల్పమంతా పూర్తయింది. కనుపాపల దృష్టిపాటవ మొక్కటి దిద్దేపనిమాత్రమే నాటికి మిగుల్చుకొన్నాడు.

మృత్తికను దిద్దే ఛురికను చేత బుచ్చుకొని విగ్రహంపై తెర తెసల్చాడు.

ఆ విగ్రహాన్ని చూసి శిల్పి స్తంభించి పోయాడు. "ఈ విగ్రహం చెక్కిందీ, నేనేనా !" అని విస్తుపోతున్నాడు. ప్రజ్ఞాగర్వంతో చేయి స్తూంది. ఒడలంతా ముచ్చెమటలు పోసినయి.

స్థైర్యం ఏర్పరచుకొని, కళాదేవికి ఆత్మలో నమస్కారాంజలు లిచ్చి, కన్ను దిద్దడం ప్రారంభించాడు. కాలం గడుస్తూన్నట్లే లేదు. పని పూర్తిచేసి కొని నిట్టూర్చి, మరల వెనుకకు వచ్చి విగ్రహాన్ని పరికిస్తున్నాడు.

ఒక నూతనదృశ్యం. అధీరుడై పోయాడు దేహాద్యంతం కంపించాడు. మహాయాతనాభరిత మైనట్లు మొగం నల్లబడి కమిలిపోసాగింది. విగ్రహానికి సమీపస్థుడై, దూరస్థుడై, చుట్టూ తిరుగుతూ విగ్రహాన్ని పరిశీలిస్తున్నాడు. మనస్సు పగిలిపోయింది. పైశాచిక ఆవేశం ఆవరించింది. ఉద్విగ్నుడై ఛురికతో విగ్రహాన్ని పొడుస్తూ చీరుతూ చిందరవందర చేయసాగాడు. విగ్రహం చితికి ఛిద్రుపలై నేల బడ్డది. అతనిలో ఆవేశం కంఠాన్నావరించింది.

"మైనా...!" అని గీపెట్టాడు.

మైనా, ఆత్రంతో లోనికి రా ప్రయత్నించింది. వాకిలితలుపు బిగించి ఉంది. యావచ్ఛక్తితో తలుపు బద్దలుగొట్టుకొని, గదిలోకి దూసుకుంటూ వాలింది.

శిల్పం ఛిన్నాభిన్నమై నేల వాలిఉంది. ప్రక్కనే వాలిఉన్నాడు శిల్పి. వేడి రక్తం ధార గట్టి, అతని గుండెలనుంచి నేలమీదికి ప్రవహిస్తూంది.

అతని తల నెమ్మదిగా లేవనెత్తి తన తొడపై పెట్టుకొని పడుకోబెట్టుకొంది. రొమ్ములో గుచ్చుకొని ఉన్న ఛురికపై ఆమెకన్నీరు ప్రవహిస్తోంది.

ఉబికిన గుండెలతో:—

"స్వామీ, ఏమిపని చేశారు!" అని అంగలార్చింది.

"మైనా..." అతనిలో శక్తి క్షీణించింది. అతి ప్రయాసతో అక్షరాలు పలుకుతున్నాడు.

"మైనా—అటు చూడు. నా పరిపూర్ణశిల్పం!"

"పరిపూర్ణత్వం లభించలేదని ఇల్లా చేశారా స్వామీ"—ఏడుస్తూంది.

"మైనా, స్వప్నసౌధం నేల కూలింది"

"ఏమయింది స్వామీ?"

"సత్యాన్ని ఎదిరించలేక పిరికి నయ్యాను"

"నాకు అర్థం కావటంలేదు."

"కళాస్వరూపంలో సౌందర్యపు పరమావధిని ఇముడ్చాలని ఆశించాను. రెండేళ్లు దేశాంతరగతుడ నయ్యాను జ్ఞప్తి ఉందా?"

"ఉంది."

"అప్పుడు దేశాలన్నీ పరిభ్రమిస్తూ ప్రపంచంలో మానవదేహపు ఒక్కొక్క అంగముయొక్క అతిరూప సౌందర్యాన్ని అవగాహన చేసుకొంటూ తిరిగాను. కాశ్మీరవనితల కపోలాలు, పంజాబీస్త్రీల భుజసౌయగము, తమిళకాంతల నిండు వక్షాలు—తెలుగు కన్నెల తనూరేఖలు, నీ నునుతొడల వంపుసొంపులు—ఇల్లా అన్ని సౌందర్యాలూ సమకూర్చి సమగ్రపరిపూర్ణ స్వరూపంలో ఆ సౌందర్యాన్ని నిర్మించ ఆశించాను."

"ఆశించి?"

"అల్లాగే విగ్రహం తయారుచేశాను."

"విగ్రహం ఎల్లా వచ్చింది?"

"ఏమి చెప్పను! అతిసామాన్యాకృతి తయారయింది. మామూలు స్త్రీరూపానికి ప్రతికృతిమాత్రమే సృష్టిఅయింది."

"అందుకని ఇంత సాహసించారా!"

"మైనా, పరిపూర్ణసౌందర్యం అని ఒక అభూత స్వప్నాన్ని భ్రమించాను. పరిపూర్ణత్వం, సామాన్యత్వానికి అనుజన్మమాత్రమే."

శిల్పిశక్తి నశించిపోతోంది. ఆ యిద్దరిచుట్టూ శిల్పి రక్తము మడుగుకట్టూంది. మృత్యువుఆహ్వానము సన్నగా వినిపిస్తూంది. మళ్లీ శిల్పిముఖంలో మందహాసం అంకురమయింది.

"మైనా—నేను ఓడిపోయా ననుకొని పొరబడ్డాను; ఓడిపోలేదు."

"అవును ప్రభూ—మీకు అపజయమనేదే లేదు."

"విను, మైనా! సంపూర్ణత్వాన్ని అన్వేషిస్తూ పరిభ్రమిస్తాము. నిత్యం సంపూర్ణత్వం సాన్నిధ్యంలోనే ఉంటుంది. సామాన్యత్వమే పరిపూర్ణత్వం. ప్రకృతి తన సర్వస్వాన్నీ ధారవోసి, సామాన్యశక్తిని సృష్టించింది. నా "సర్వాంగసుందరి" సామాన్యగా మిగిలిపోవటానికి కారణము అదే. ప్రకృతి మన కిచ్చే సందేశమూ అదే—"

శిల్పి పలుకు ఆగిపోయింది. ఆ గూటిచిలుక యెగిరిపోయింది.

మైనా అతని తలను తనతొడమీదనుంచి మెల్లిగా జార్చి, విగ్రహానికి ముసుగు వేసే వసనాన్ని అతని దేహానికి కప్పింది. ఆ జీర్ణవిగ్రహంవంక చూస్తూ కూర్చుంది.

అటు శిథిలవిగ్రహం; ఇటు శీర్ణప్రాణి శిల్పి. ఆ రెంటిమధ్య భగ్నహృదయ అబల. ఆమెకంట నీటిచుక్క లేదు.

మైనా అలాగే కూర్చుని ఉంది. మళ్లీ లేవలేదు.